

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024



వీర్నపల్లిలో గాలివాన బీభత్సం 8
- వర్షానికి తడిసిన ధాన్యం - నేలరాలిన మామిడి

బీఆర్‌ఎస్ నుంచి పారిపోతున్న అభ్యర్థులు 8



కాంగ్రెస్‌లో చేరికల జోరు

- వరుసకట్టిన బీఆర్‌ఎస్ నాయకులు
- స్థానిక సంస్థల కోసమే చేరికలా?
- అసంతృప్తులపై కాంగ్రెస్ దృష్టి
- పార్టీ వీడుతున్న బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు
- సిరిసిల్ల, వేములవాడలో మారుతున్న రాజకీయ పరిణామాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల సందడి మొదలైంది. అదే వరుసలో స్థానిక సంస్థల ఎన్నికలు జూన్‌లో నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడానికి ముందు వరుసలో నిలుస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో తమ ఉనికి చాటుకొని స్థానిక సంస్థలో పోటీకి దిగాలనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధులు, తాజా మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు వరుస పెట్టి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. జడ్పీటీసీస్థాయి నుంచి మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు ఆ పార్టీలో చేరుతున్నారు. వేములవాడ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గంలో కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ మండలాల్లో బీఆర్‌ఎస్‌లోని ముఖ్యుల్లో కొందరు కాంగ్రెస్‌లో చేరారు. బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గతంలో పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన సమయంలో సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో నాయకులతో ఎక్కువగా సంబంధాలు ఉన్నాయి. వారిలో కొందరు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాజకీయ భవిష్యత్ నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కూడా తిరిగి సొంతగూటికి చేరుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ వలస రాజకీయాలు ఫలితాలపై ప్రభావం చూపే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నాయకా.. చేరిక

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో కొద్ది రోజులుగా జరుగుతున్న చేరికల్లో ఇతర నాయకులను కలుపుకొని బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచులు, దంపతులైన నేవూరి వెంకటిరెడ్డి, నేవూరి మమతతోపాటు మాజీ సర్పంచులు మందాటి దేవేందర్‌యాదవ్, పొన్నాల మంజుల, గొల్లపల్లి మల్లేశం, కదిలే రజిత, దాసరి సుజాత, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, ఒగ్గు బాలరాజు, పొన్నం బాలకిషన్, ఎల్లారెడ్డిపేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బండారి బల్‌రెడ్డితోపాటు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, బీజేపీ ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు నందికిషన్, బీఎస్పీ నాయకుడు ఎడ్లరాజు కాంగ్రెస్‌లో చేరారు. తంగళ్లపల్లి మండలంలో బీఆర్‌ఎస్ నుంచి చీర్లవంచ ఎంపీటీసీ నలువాల రేణుక, లింగాపూర్ ఎంపీటీసీ భైరినేని రాము, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు మంజుల, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, సిరిసిల్ల అర్బన్ మండలం నుంచి మాజీ ఎంపీటీసీ చల్ల హరికృష్ణ, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సుంకరి సాయికుమార్, సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు భూక్య రెడ్డి నాయక్, గుండ్లపల్లి రామానుజం, జాగీరు శైలు, కుడిక్యాల రవి, వేముల రవి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణతోపాటు ఇటీవల నుంచి బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన పిట్టల భూమేష్ కాంగ్రెస్‌లో చేరారు. కోనరావుపేట మండలం నుంచి వెంకట్రావుపేట ఎంపీటీసీ పల్లె మంజుల, కోనరావుపేట ఎంపీటీసీ దేవరకొండ చారి, కొలనూర్ మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్, పల్లి మక్త మాజీ సర్పంచ్ నందగిరి అంజయ్య, బోయినపల్లి నుంచి స్తంబంపల్లి ఎంపీటీసీ ఉపేందర్, జెగ్గారావుపల్లి ఎంపీటీసీ శిరీష, మాజీ సర్పంచ్ సౌందర్య, మాజీ ఎంపీటీసీ సంపత్, మాజీ సర్పంచ్ కనకమ్మ బీఆర్‌ఎస్‌ను వీడితే, బీజేపీ నుంచి మానువాడ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, విలాసాగర్ మాజీ సర్పంచ్ రవీందర్ కాంగ్రెస్‌లో చేరారు. ముస్తాబాద్‌లో జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ జడ్పీటీసీ యాదగిరిగౌడ్, మాజీ ఎంపీపీ లక్ష్మీ కిషన్‌రావు, మాజీ సర్పంచులు కిషన్‌రావు, కళ్యాణి, యారటి లక్ష్మీ, రేసు లక్ష్మీ, భూక్య దేవేందర్, కరుణాల కళ చేరారు. బీజేపీ నుంచి సింగిల్ విండో మాజీ చైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రుద్రంగి మండలంలో బీఆర్‌ఎస్ నుంచి జడ్పీటీసీ గట్ల మీనయ్య, లక్ష్మీనర్సింహా స్వామి దేవస్థానం చైర్మన్ శంకర్, సింగిల్ విండో డైరెక్టర్ నర్సిరెడ్డి, మాజీ సర్పంచులు నారాయణ, ఎంపీటీసీ మోతె నర్సయ్య, వేములవాడ అర్బన్ నుంచి సింగిల్ విండో చైర్మన్ సల్మాన్‌రెడ్డి, డైరెక్టర్ పోచవేని నాగరాజు, చిలువేరి సత్తయ్య, ఎంపీటీసీలు వనపర్తి దేవరాజు, గాలిపెల్లి సువర్ణ కాంగ్రెస్‌లో చేరారు. గంభీరావుపేటలో గతంలోనే ఫార్వర్డ్ బ్లాక్ నుంచి మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం కాంగ్రెస్‌లో చేరారు. అదే బాటలో ఆయన తనయుడు బీఆర్‌ఎస్ నుంచి గంభీరావుపేట మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, కొత్తపల్లి మాజీ సర్పంచ్ సరళ, సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజనర్సింహారెడ్డి, దమ్మనపేట ఉపసర్పంచ్ అంజిరెడ్డి, వీర్నపల్లిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నాగరాజు కాంగ్రెస్‌లో చేరారు. సిరిసిల్ల, వేములవాడలో మరో వారం రోజుల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరనున్నట్లుగా తెలుస్తోంది.

గులాబీ శ్రేణుల్లో అయోమయం

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో లోక్‌సభ అభ్యర్థి వినోద్‌కుమార్ ఇప్పటికే ప్రచారం చేపట్టారు. వినోద్‌కుమార్ ఒక వైపు ప్రచారం చేస్తున్నా ఆయనతో కింది స్థాయి నాయకులు కలిసి పనిచేస్తున్నట్లుగా కనిపించడం లేదు. కాంగ్రెస్‌లో చేరే క్రమంలోనే బీఆర్‌ఎస్‌కు దూరంగా ఉంటున్నారనే చర్చ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌కు ఓట్ల శాతం భారీగా పడిపోతుందనే చర్చ కూడా మొదలైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు 70,482 ఓట్లు, బీజేపీకి 64,769 ఓట్లు, కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు, వేములవాడ సెగ్మెంట్‌లో బీజేపీకి 73,290 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 47,399 ఓట్లు, కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు లభించాయి. ఈ సారి బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ఓటు బ్యాంక్ ఉంటుందని భావిస్తున్నారు. మోదీ హవాతో యువత అటు మొగ్గు చూపితే, ఆరు గ్యారంటీల ప్రభావంతో ఓటు బ్యాంక్ పెరుగుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో ఉన్న అసంతృప్త నేతలపై దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.

దృష్టంతా 'స్థానికం' పైనే

జిల్లాలో లోక్‌సభ ఎన్నికల తర్వాత వరుసగా సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి. ఈ క్రమంలోనే సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు గ్రామాల్లో బీఆర్‌ఎస్‌లో అసంతృప్త, ఆదరణ లేక నిరాశతో ఉన్నవారు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా బీఆర్‌ఎస్‌ను నమ్ముకొని ఆ పార్టీలో పనిచేస్తూ స్థానిక ఎన్నికల్లో భంగపడుతూ వస్తున్న వారు ఈ సారి కాంగ్రెస్‌లో చేరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడంపై దృష్టిసారించినట్లు చెప్పుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పని తీరు ఆధారంగానే అవకాశాలు లభిస్తాయని చెబుతున్న నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలుస్తోంది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేట, ఏప్రిల్ 19: ప్రభుత్వ దవాఖానాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, ముచ్చర్లలోని ఆరోగ్య సబ్ సెంటర్లను శుక్రవారం తనిఖీ చేశారు. సముద్ర లింగాపూర్ వైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దంత వైద్య శిబిరం, రోగులకు అందిస్తున్న సేవలు, ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలను పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమా దేవి, మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీలు శివాని, వనజ పాల్గొన్నారు.

వెదర్ స్టేషన్ పరిశీలన

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంపై ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌ను అర్థ గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, డీఏఎస్‌వోలు శ్యాంసుందర్, గణేష్, సీపీవో శ్రీనివాసాచారి, డీపీవో భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. యంత్రం పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వర్షపాతం వివరాలు ఎలా నమోదు అవుతున్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో మొత్తం 21 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు వాతావరణం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాలలో వరి కోత ప్రయోగం నిర్వహణను పరిశీలించారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో ఉమారాణి అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు సిరిసిల్ల లోని జిల్లా సమాఖ్యలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్డీవో శేషాద్రి, స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: చెత్త శుద్ధీకరణ కేంద్రాలు నిర్వహణ సక్రమంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లిలో చెత్త శుద్ధీకరణ కేంద్రం, నర్సరీలను ఎంపీడీవో రాజుతో కలిసి పరిశీలించారు. పల్లె ప్రగతి యాప్ నిర్వహణ, సిబ్బంది విధులు తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు.

జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: ఉపాధిహామీ పనుల లక్ష్యాన్ని పూర్తి చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 8815 జాబ్ కార్డులకు 8,81,500 పనిదినాలు ప్రతీ కుటుంబానికి కల్పించాలన్నారు. కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, మెడికల్ కిట్స్, ఎండ భారీన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వంద రోజుల పని కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రోగ్రాం అధికారి నర్సింహులు, ఎంపీడీవో జోగం రాజు, రాజనర్సయ్య, లక్షణ్, మనోహర్, దేవి, సుష్మ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో జాగ్రత్తలు పాటించాలి



తనిఖీ చేస్తున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19: వేసవి సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని డీఈవో రమేష్‌కుమార్ సూచించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు జరుగుతున్న వార్షిక పరీక్షలను పరిశీలించారు. ఈ నెల 23వ తేదీన విద్యార్థులకు తప్పనిసరిగా ప్రగతి పత్రాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని విజయ, ఉపాధ్యాయిని స్వాతిలు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌ల పరిశీలన

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మొదటి రాండమైజేషన్‌లో భాగంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలు, వీవీప్యాట్‌ల తరలింపును శుక్రవారం కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్ధాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో ఏర్పాటు చేసిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను రెండు నియోజకవర్గాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించే ప్రక్రియను వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో పర్యవేక్షించారు. సిరిసిల్ల నియోజకవర్గానికి కంట్రోల్ యూనిట్ 358, బ్యాలెట్ యూనిట్స్ 358, వీవీ ప్యాట్‌లు 401, వేములవాడ నియోజకవర్గానికి కంట్రోల్ యూనిట్స్ 325, బ్యాలెట్ యూనిట్స్ 325, వీవీ ప్యాట్‌లు 364 కేటాయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు



వాహనదారులకు జరిమానా విధిస్తున్న డీటీవో లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. ధృవీకరణ పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీటీవో లక్ష్మణ్ మాట్లాడుతూ వాహనదారులు విధిగా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్, రోడ్డు టాక్స్ చెల్లించని వాహనాలపై కేసు నమోదు చేస్తామన్నారు. నిత్యం తనిఖీలు ముమ్మరం చేసి జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని పేర్కొన్నారు. మరోవైపు తనిఖీల్లో ఓ ప్రైవేటు వ్యక్తి అధికారిలా వ్యవహరిస్తూ వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వ్యక్తి తీరుపై మండి పడ్డారు. ప్రైవేటు వ్యక్తి వాహనాలను ఎలా తనిఖీలు చేస్తారని ప్రశ్నించారు. వాహన తనిఖీలు కొనసాగుతున్నాయనే సమాచారంతో వాహనదారులు రోడ్డుకిరువైపుల సుమారు గంట పాటు తమ వాహనాలను నిలిపి వేచి చూశారు.

బండి సంజయ్ తరపున నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి శుక్రవారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తరపున ఆ పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీజేపీ పార్టీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్ కార్పొరేషన్ మాజీ మేయర్ డి.శంకర్, బీజేపీ నాయకుడు బండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల బకాయిల విడుదలపై బీజేపీ హర్షం

కరీంనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్): నేతన్నల బకాయిల విడుదలపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, రాజన్న సిరిసిల్ల బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప రామకృష్ణ, గోపి, ఆడెపు రవీందర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సిరిసిల్లనేత కార్మికులకు ఇంకా రావాల్సిన రూ.301 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ పోరాటం ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల బకాయిలను విడుదల చేసిందని తెలిపారు. బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసిన యజమానులకు సైతం ప్రభుత్వం నుంచి సక్రమంగా పేమెంట్లు రాకపోవడంతో రూ.270 కోట్లమేర బకాయిలు పేరుకు పోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా కొత్త ఆర్డర్లు ఇచ్చి నేత కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాలన్నారు. పవర్ లూం కార్ఖానాలకు 30 సంవత్సరాల నుంచి 50 శాతం సబ్సిడీతో అందజేస్తున్న విద్యుత్‌ను పునరుద్ధరించాలని, కార్మికులకు ఇవ్వాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ వెంటనే అందించాలని కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభం అధిగమించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో బీజేపీ తరఫున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో సేవాలాల్ మహారాజ్, జగదాంబ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గిరిజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఐడీటీఆర్‌లో యోగా శిక్షణ తరగతులు



యోగా శిక్షణలో డ్రైవర్లు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, డ్రైవర్లకు యోగా ఎంతో ఉపకరిస్తుందని యోగా శిక్షకుడు ఉప్పల శ్రీనివాస్ అన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ఐడీటీఆర్ (ఇంటర్ నేషనల్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ సెంటర్)లో డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్న వారికి 15 రోజులగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. డ్రైవింగ్‌తో తరచూ వచ్చే ఇబ్బందులు తొలగిపోవడానికి యోగాలోని ఆసనాలతోపాటు మెడిటేషన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బువ రాఘవన్, సీనియర్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ విజయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ మనోహర్, రణదీర్, నరేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న వడగళ్ల వర్షం

- పగలు ఎండలు.. సాయంత్రం మబ్బులు
- అకాల వర్షంతో అన్నదాతల్లో ఆందోళన



రుద్రంగిలో తడిసిన ధాన్యం

సిరిసిల్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో పంటలు సాగు చేసిన రైతులు కరువు పరిస్థితుల్లో పంటను దక్కించుకోవడానికి అవస్థలు పడుతుండగా మరోవైపు వడగళ్ల వర్షాలు భయపెడుతున్నాయి. పొద్దంతా భగ్గుమంటున్న ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతుండగా సాయంత్రం వేళ ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుంటుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శుక్రవారం జిల్లాలో అధిక ఎండతో ప్రజలు ఇబ్బందులు పడగా సాయంత్రం కురిసిన వర్షం అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చింది. వీర్నపల్లిలో గాలి దుమారానికి మామిడి కాయలు రాలిపోయాయి. పది వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. ఇల్లంతకుంటలో గాలిదుమారంతో కురిసిన వర్షానికి ధాన్యం తడవగా మండలంలోని జంగమరెడ్డిపల్లెలో పిడుగుపాటుకు పారిపెల్లి రాజిరెడ్డికి చెందిన ఆవు మృతిచెందింది. రుద్రంగి మండలాల్లో వర్షానికి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో ఈదురుగాలులకు రేకుల షెడ్డు కొట్టుకుపోయింది. మరో వైపు రెండు రోజులుగా జిల్లాలో ఎండలు ప్రతాపం చూపుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రత 26.5 ఉండగా గరిష్ఠ ఉష్ణోగ్రత 44.5 డిగ్రీలుగా ఉంది. కోనరావుపేట, సిరిసిల్ల, వేములవాడ రూరల్, చందుర్తి, వీర్నపల్లి, ఇల్లంతకుంట, రుద్రంగి, గంభీరావుపేట, మండలాల్లో 40 నుంచి 44 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

26 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేష్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ 2,6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26 నుంచి మే3 వరకు జరుగుతాయని పరీక్షలు నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

'ఉపాధి' కూలీలపై బండరాయి పడి ముగ్గురికి గాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: మండలంలోని సుద్దాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. మట్టి తవ్వుతుండగా పైనుంచి పెద్ద బండరాయి పడడంతో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. మరి కొందరు తృటిలో ప్రాణాలు కాపాడుకున్నారు. సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సుద్దాలలోని పెద్దమ్మ కుంట వద్ద 160 మంది కూలీలు కొన్ని రోజులుగా పూడిక తీత పనులు చేస్తున్నారు. శుక్రవారం కూడా వారు పని చేస్తుండగా పై నుంచి పెద్ద బండరాయి కూలీలపై పడింది. బుర్ర స్వరూప, కలువల లింగమ్మ, తార అనే ముగ్గురు మహిళలు గాయపడ్డారు. వెంటనే వీరిని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సుల్తానాబాద్ అస్పత్రికి తరలించారు. అనంతరం ముగ్గురిని ఎంపీడీవో కరీంనగర్ అస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. వీరిలో తార, లింగమ్మ లకు మామూలు గాయాలు కాగా బుర్ర స్వరూపకు నడుముకు గాయం కావడంతో అమెకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారని తెలిపారు. సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అన్నారు. అస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కాంగ్రెస్ నాయకుడు మినుపాల ప్రకాష్‌రావు పరామర్శించారు.



అస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

పిడుగు పడి రైతు కూలీకి తీవ్రగాయాలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 19: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెంది న కోరుట్ల రమేష్ అను రైతు కూలీ శుక్రవారం సాయంత్రం పడ్డ పిడుగు పాటుకు తీవ్రగాయాలపాలయ్యాడు. గ్రామంలోని కోరుట్ల రమేష్ వ్యవసాయ కూలీ పనులను చేసుకంటూ జీవనం కోనసాగిస్తున్నాడు. శుక్రవారం సాయం త్రం కూలీ పనులు ముగించుకోని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఈదురు గాలులు, ఉరుములతో కూడి చినుకులు కురిసింది. చినుకులు పడుతుందని రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడింది. చెట్టు పక్క కాడం ఊడిపోవడంతో రమేష్ కాలు, చెయికి తీవ్రగాయల పాలవడంతో పాటు పిడుగు పాటుకు ఆయన ఒంటి బలమైన గాయాలు తలిగినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు చికిత్స కోసం మెట్‌ప ల్లి అనుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్న అతనికి తీవ్రగాయల పాలైనం దుకు ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెం దిన పారిపెల్లి రాజిరెడ్డికి చెందిన ఆవు పిడుగుపాటుతో మృతిచెందింది. రాజు తన పాడి ఆవును శుక్రవారం వ్యవసాయ బావివద్ద కట్టివేసిరాగా సాయం త్రం పడిన పడిగుపాటుతో మృతిచెందింది. దీనితో తనకు రూ 80వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాజిరెడ్డి విలపిస్తు కోరాడు.

విద్యుదాఘాతంతో గేదె..

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని సర్పరాజుపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన కొక్కు గణేష్ తన గెదలను మోపడానికి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేతంకు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్ పార్మర్ వద్ద మోస్తుండంగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినుట్ల గ్రామస్థులు తెలిపారు. కాగా యజమాని గణేష్ సుమార్ రూ. 50000 వరకు నష్టం వాటిలినట్లు బాదితుడు తెలిపాడు. బాదితుడిని ప్రభుత్వ పరంగా అదుకోవాలని గ్రామస్థులు కొరుతున్నారు.

పాముకాటుకు ఎద్దు..

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన మాటేటి పర్వతాలు అనే రైతుకు చెందిన ఎద్దు శుక్రవారం పాటుకాటుకు గురై మృతి చెందింది. పొలం వద్ద గడ్డి మేస్తున్న తరుణంలో పాటుకాటుకు గురైంది. పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌కు సమాచారం అందించగా స్పందించి వైద్యం చేసినా అప్పటికే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు 60 వెల వరకు ఉంటుంది.

ఆలయంలో చొరబడి ఫొటోలు, తులసి గద్దె విసిరివేత

- అన్యమతస్థుల పనేనని అనుమానం
- హనుమాన్ మాలధారుల ఆందోళన
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- విచారణ చేపట్టిన పోలీసులు





పొలంలో పడవేసిన వేంకటేశ్వర స్వామి చిత్రపటం, విచారణ జరుపుతున్న ఎస్సై ఉమా సాగర్

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని జగదేవ్‌పేట నగారా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆకతాయిలు ఆగడం సృష్టించారు. ఆలయంలో ఉన్న వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి చిత్రపటాలను, తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరివేయడం కలకలం సృష్టించింది. వివరాలలోకి వెళ్లితే... జగదేవ్‌పేటలోని నగారా వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం హనుమాన్ మాలధారులు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని పెట్టుకొని పూజలు నిర్వహిస్తూ రాత్రి అక్కడే బస చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం లక్ష్మిపూర్ ఆలయానికి దర్శనార్థం వెళ్లారు. అదను చూసుకున్న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి ఆలయంలోని వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ చిత్రపటాలతో పాటు ఆలయం ముందు ఉన్న తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరి వేశారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన హనుమాన్ మాలధారులు దేవుళ్ల చిత్రపటాలు పొలంలో పారవేయడం చూసి ఆందోళన చెందారు. ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్యకు, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డిలకు సమాచారం ఇచ్చారు. మాలధారులు, మరికొందరు కలిసి వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమాసాగర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలి ముద్రలు సేకరించారు. కాగా ఈ పని చేసింది అన్యమతస్తులేనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్య, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి హనుమాన్ దీక్ష పరులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో హిందూ దేవాలయాలు, హనుమాన్ దీక్ష పరులను అవమానించడం ఎక్కువగా జరుగుతోందని బీజేపీ నాయకుడు కొమ్ము రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి

మేడిపల్లి, ఏప్రిల్ 19: మేడిపల్లి మండల కేంద్రంలో నీటి తొట్టిలో పడి బాలుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఒరిస్సాకు చెందిన బైగని సాబర్ అనే మహిళ తన ఇద్దరు పిల్లలను తీసుకొని నాలుగు నెలల క్రితం స్థానికంగా ఉన్న ఇటుక బట్టిలో పనిలో చేరింది. గురువారం సాయంత్రం పిల్లలతో కలిసి పరమేష్(7) నీటి సంపు వద్ద స్నానానివెళ్లి ప్రమాదవశాత్తు తొట్టిలో పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకు తీసి జగిత్యాల అసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రెండేళ్ల క్రితమే మృతి చెందాడు. మృతుడి తల్లి బైగని సాబర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ ఇలియాజ్ అహ్మద్ తెలిపారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని వంతెనపై శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి మండలంలోని పదిర గ్రామానికి చెందిన వ్యక్తి రెక్కల బుచ్చిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పదిరలోని వ్యక్తి బుచ్చిరెడ్డి తన ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, ఏప్రిల్ 19: మండల కేంద్రానికి చెందిన చింతం లక్ష్మి(74) అనే వృద్ధురాలు శుక్రవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగిన నయం కాకపోవడంతో మానసిక వేదనకు గురవుతోంది. మళ్లీ డాక్టర్ల చుట్టూ తిరగలేక, బ్రతుకు మీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్19: కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్ వద్ద కరీంనగర్-వేములవాడ రోడ్డుపై శుక్రవారం ఉదయం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో శాంతినగర్‌కు చెందిన యువకుడు రాక్ విశాల్(19) దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాల్ తన బైక్‌పై కమాన్‌పూర్‌లోని బంక్‌లో పెట్రోల్ నింపుకుని తిరిగి శాంతినగర్‌కు వస్తున్న సమయంలో కరీంనగర్ నుంచి వేములవాడ వైపు అతివేగంగా బైక్‌పై వెళ్తున్న భూమి రాకేష్ ఢీకొట్టాడు. దీంతో విశాల్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంలో రాకేష్‌కు కూడా గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి కవిత ఫిర్యాదుతో కేసు విచారణ జరపుతున్నామని పోలీసులు తెలిపారు.

హుజూరాబాద్ డిపోలో ఆరుగురిపై బదిలీ వేటు

హుజూరాబాద్, ఏప్రిల్ 19: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో పనిచేసే ఆరుగురి ఉద్యోగులపై శుక్రవారం వేటు పడింది. ఈ మేరకు ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం సురికొంటి భూపతిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్20వేల రూపాయలు లంచం తీసుకుం టూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. దీనికి స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డిపో కార్యా లయంలో పనిచేసే కొంత మంది సిబ్బంది శ్రీకాంత్‌కు సన్నిహితంగా ఉన్నారని ఆర్టీసీ విజిలెన్స్ ఎంక్వైరీ అధికా రులు ఇచ్చిన నివేదిక మేరకు ఆరుగురిని కరీంనగర్ ఆర్ ఎం కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ అయిన వారి లో రాజమణి (డ్యూటీ చాటింగ్), వెంకటయ్య (బుకింగ్ క్లర్క్), సురేందర్ (సూపరింటెండెంట్), జాఫర్ (మెకానిక్ ఎల్వో), రవీందర్ (డ్రైవర్), శంకరపట్నం బస్టాండ్‌లో పనిచేసే స్వామిలను బదిలీ చేశారు. ఇదే డిపోలో మరో ఇద్దరిపై కూడా బదిలీ వేటు పడనున్నట్లు తెలిసింది.

తాటి చెట్లు దగ్ధం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలం తాడూరు శివారులో అగ్ని ప్రమాదంలో తాటి చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో గీతకార్మికులు సుమారు 500 తాటి చెట్లను పది సంవత్సరాలుగా సంరక్షిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాద వశాత్తు నిప్పు అంటుకొని మంటలు చెలరేగడంతో సుమారు 300 తాటి చెట్లు దగ్ధం అయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలాన్ని గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కాగా దగ్ధం అయిన చెట్లను కాంగ్రెస్ నాయకుడు పుర్మాణి లింగారెడ్డి, మీరాల శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న నిందితుడి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట వద్ద ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని పరీద్‌పేటకు చెందిన కోల రవిగౌడ్ (46)ను శుక్రవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇతను సిరిసిల్ల పట్టణంలోని సినారె గ్రంథాలయం, దామిని బార్ ఎదుట పార్క్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను చోరీచేసి ఒక వాహనాన్ని చెట్ల పొదల్లో దాచిపెట్టి మరో వాహనంపై తిరుగుతండగా పట్టుకున్నామని తెలిపారు. చోరీ చేసిన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని దొంగను కోర్టులో హాజరుపరచామని ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని కిషన్‌రావుపేటలో శుక్రవారం డీఎస్పీ రఘుచందర్ ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. కిషన్‌రావుపేటకు చెందిన మెరుగు కొమురయ్య అనే వ్యక్తి తనను కలుం పేరుతో దూషించాడని అదే గ్రామానికి చెందిన అన్నపూర్ణ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కొమురయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ రఘుచందర్ కిషన్‌రావుపేటలో విచారణ చేపట్టారు. సాక్షులను విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్సై ఉమాసాగర్ ఉన్నారు.

స్కూల్ ఆటో బోల్తా

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రత్నాపూర్ గ్రామసమీపంలో కారు ఢీకొట్టిన ప్రమాదంలో స్కూల్ ఆటో బోల్తాపడింది. సెంటినరీకాలనీ నుంచి నాగే పల్లి వైపు టిఎస్22 టిప 2087 నంబరు గల ఆటోలో ప్రైవేట్ స్కూల్ విద్యా ర్థులను తరలిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో విద్యార్థులతో ఉన్న ఆటో పల్టీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ నరివెద్ది సంపత్‌కు ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా, విద్యార్థులకు గాయాలు కాలేదు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆరో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.వి.శ్రీరంగప్రసాద్ తెలిపారు. మొత్తం 16,557 మంది విద్యార్థులకు గాను 16,003 మంది విద్యార్థులు హాజరు కాగా 554మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు ఏమీ నమోదు కాలేదని ఆయన తెలిపారు.

పాలీసెట్ దరఖాస్తుకు 22 వరకు గడువు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలీసెట్-24) రాసేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు కరీంనగర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్ ఆదర్శ మహిళా రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరిం చారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఎనిమిది మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా అందులో ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా ఐదుగురు వ్యక్తులకు 10 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

కరీంనగర్‌లో రూ.15.81లక్షల నగదు సీజ్





కరీంనగర్‌లో సీజ్ చేసిన నగదును చూపిస్తున్న సీఐ సరిలాల్, వేములవాడలో నగదు స్వాధీనం చేసుకున్నట్టు పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం కరీంనగర్‌లోని పలుచోట్ల శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని 15 లక్షల 81 వేల 900 రూపాయల నగదును పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్ చౌక్ వద్ద కరీంనగర్ దుర్గమ్మగడ్డకు చెందిన జలగం సుమన్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న ఏడు లక్షల నగదును సీజ్ చేశారు. కరీంనగర్ రెండో ఠాణా పరిధిలోని ఇందిరా చౌక్ వద్ద మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్(కపిల్ చిట్‌ఫండ్స్) వద్ద 1,11,900 రూపాయలు, ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన కొల ప్రదీప్ కుమార్ వద్ద 5,70,000 రూపాయలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ మూడో ఠాణా పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో కట్టారాంపూర్‌కు చెందిన గాండ్ల సురేష్‌వద్ద 2 లక్షల రూపాయలను స్వాధీన పరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మొత్తం నగదును తదుపరి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని సీఐలు సరిలాల్, విజయ్ కుమార్, జాన్‌రెడ్డిలు తెలిపారు.

- **వేములవాడలో 5.67 లక్షలు పట్టివేత..**

వేములవాడ: వేములవాడ పట్టణంలో తగిన పత్రాలు లేకుండా తీసుకువెళుతున్న ఐదు లక్షల 67 వేల రూపాయల నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తనిఖీల సందర్భంగా నంద్యాడపు నర్సయ్య అనే వ్యక్తి వద్ద ఐదు లక్షల 67 వేల రూపాయలు పట్టుబడ్డాయని తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు తెలిపారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం



చిన్నమల్లయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఓ వైపు అప్పులు చేసి పంట సాగు చేస్తే తెగుళ్ల సోకి దిగుబడి రాదనే ఆందోళన.. మరో వైపు ఇంటి భవన నిర్మాణానికి తెచ్చిన బాకీలు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందిన అన్నదాత నెత్తెట్ల చిన్నమల్లయ్య(48) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామంలో శుక్రవారం విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రైతు చిన్నమల్లయ్య తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిని యేడాది కిందట మూడు లక్షల రూపాయలు అప్పులు చేసి చదును చేశాడు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో మరో రూ.1.50 లక్షలు అప్పు తీసుకువచ్చి వరి పంట వేశాడు. పంటకు తెగుళ్ల సోకి దిగుబడి తగ్గుతోందని ఆందోళన చెందాడు. ఇటీవల రూ. 10.50 లక్షలు అప్పులు చేసి ఇంటి భవన నిర్మాణాన్ని చేపట్టాడు. బాకీలు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన చిన్నమల్లయ్య ఈ నెల 18న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో గొర్రెల కాపారులకు వ్యవసాయ పొలం సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడ చేరుకుని చిన్నమల్లయ్యదీగా గుర్తించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా రోదించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కొడుకు అజయ్, కూతురు అమూల్య ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

స్కూల్ యూనిఫాంల తయారీలో నాణ్యత పాటించాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు



సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో క్లాత్ తయారీని పరిశీలిస్తున్న మల్లయ్యభట్టు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంల వస్త్రాలను నాణ్యతప్రమాణాలతో తయారు చేసి అందించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మలయ్యభట్టు అధికారులకు సూచించారు. సిరిసిల్ల పట్టణంతో పాటు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో తయారవుతున్న ఆర్వీఎం వస్త్రాలతో పాటు చంద్రంపేటలోని గౌడ సైజింగ్‌లను శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి మల్లయ్యభట్టు సందర్శించి తయారుచేసిన వస్త్రాలతో పాటు తయారీ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ పార్కులో తయారు చేస్తున్న స్కూల్ యూనిఫాం వస్త్రాల తయారీతో పాటు వాటిలో ఉండే నాణ్యతలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంఓ జోసెఫ్, టెస్కో జనరల్ మేనేజర్ ఎల్ వెంకటేశ్వర్‌రావు, చేనేత జౌళిశాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, ఏడీ సాగర్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, జెండర్, ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ, ఈఈ అనిత తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మలయ్యభట్టు

- **కస్తూర్బాగాంధీ పాఠశాలల తనిఖీ..**

సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూర్‌లో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలతో పాటు తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలను శుక్రవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు ఆకస్మికంగా సందర్శించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనాలను పరిశీలించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు వసతులను కల్పించి చూసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనాలతో పాటు వసతులను అందిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల పాఠశాలకు మంజూరైన అదనపు అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంవో జోసెఫ్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, పద్మజ, పాఠశాల ప్రత్యేక అధికారి పావనిలు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 19: వేములవాడ మండలం అనుపురం ముంపు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పరును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు రూరల్ తహసీల్దార్ సుజాత శుక్రవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ముంపు గ్రామాల పరిధిలోని గ్రామాల భూముల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఒక్క టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని నలుగురు వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కరునాథం శివకృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బొల్లం రాజు, తిప్పరవేణి చంద్రశేఖర్, ధర్మ శ్రీనివాస్‌కు పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో ఉద్యోగాలు ఇప్పిస్తానని సిరిసిల్ల పట్టణానికి చెందిన శివకృష్ణ 2018లో రూ 6.50లక్షలు తీసుకున్నాడు. శివకృష్ణ వ్యవసాయశాఖలో అటెండర్‌గా పనిచేస్తుండటంతో నమ్మి డబ్బులు ఇచ్చామని 2013లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హైద్రాబాద్‌లో ఉంటున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిరుద్యోగులు ఎవరు ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

కొండగట్టులో నత్తనడకన చిన్న జయంతి ఏర్పాట్లు



ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణం

మల్యాల, ఏప్రిల్ 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో చిన్న జయంతి ఏర్పాట్లు నెమ్మదిగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జయంతి వేడుకలకు గాను ఇప్పటికే దాదాపుగా ఏర్పాట్లు పూర్తి కావాల్సి ఉండగా నత్తనడకన సాగుతున్నాయి. కొండపైన దీక్షపరులు, లడ్డూ ప్రసాదాల కోసం క్యూలైన్‌లు ఏర్పాటు కాగా మిగితా ఏర్పట్లు అంతంత మాత్రమే. విద్యుత్ లైట్స్, మైక్‌ల పనులు కావాల్సి ఉండగా చలివేంద్రాల ఏర్పాటు ఊసేలేదు. భక్తులు నడిచి వచ్చే ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గంలో చేపట్టాల్సిన సౌకర్యాలు ప్రారంభించలేదు. జయంతికి సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు మాత్రం ఏర్పాటు చేశారు. లక్షలాదిగా తరలివచ్చే దీక్షపరులకు తగిన సౌకర్యాలను త్వరగా పూర్తిచేయాలని ఇటీవల కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలో మరోసారి సమపన్వయ సమావేశం నిర్వహించినా ఏర్పాట్లలో వేగం కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతన్నారు.



ఘాట్‌రోడ్డు వెంట లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అస్వస్థత

- వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి
- 25 మందికి ఆస్పత్రిలో చికిత్స



చికిత్స పొందుతున్న విద్యార్థులు



హాస్టల్‌లోని సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: సుల్తానాబాద్ పట్టణ శివారులో ఉన్న సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల వసతి గృహంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థకు గురయ్యారు. హాస్టల్‌లో మొత్తం విద్యార్థుల సంఖ్య 480 మంది కాగా, గురువారం 372 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 20 మందికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి మొదలైంది. హాస్టల్‌లో సిబ్బంది వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. శుక్రవారం మరో ఐదు మంది విద్యార్థులకు కూడా ఇదే విధంగా వాంతులు, విరేచనాలు కావడంతో వారిని కూడా ఆస్పత్రికిలో చేర్చారు. పరీక్షలు ఉండడంతో కొంతవరకు కోలుకున్న వారిని శుక్రవారం ఉదయం హాస్టల్‌కు తరలించారు. పరీక్షల తర్వాత వారిని హాస్టల్‌లోని ఒక ప్రత్యేక గదిలో ఉంచి శుక్రవారం రాత్రి డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరగన్నం మాత్రమే అందించారు. గురువారం సాయంత్రం బొండాలు పెట్టారని, అవి తినలేని పరిస్థితిలో ఉన్నాయని, ఈ విషయం హాస్టల్ ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, కొందరు వాటిని పడవేశారని, తిన్న తమకు వాంతులు, విరోచనాలు, విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

- **రీజనల్ డైరెక్టర్ పరిశీలన...**

హాస్టల్‌లో ఆహారం పడక కొంత మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న సోషల్ వేల్ఫేర్ శాఖ రీజనల్ డైరెక్టర్ మేరీ ఏసుపాదం శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని, హాస్టల్‌లో ఉన్న వారిని పరామర్శించారు. ఇలా ఎందుకు జరిగిందని ఆరా తీశారు.

- **మెనూ ప్రకారం పెడుతున్నాం..**

- సత్యప్రసాద్, ప్రిన్సిపాల్

మెనూ ప్రకారమే హాస్టల్‌లో భోజనం, టిఫిన్‌లు పెడుతున్నాం. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం కూడా బోండాలు పెట్టాం. బోండా పిండి కొంచెం పలుచగా రావడం వల్లన నూనె ఎక్కువ పీల్చుకోవడంతో అవి కొందరికి పడకపోయి ఉండవచ్చు. నాకు సమాచారం రాగానే హైదరాబాద్ నుంచి తెల్లవారుజామున సుల్తానాబాద్ వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించాను. వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నాం. డిశ్చార్జీ అయి వచ్చిన విద్యార్థులకు డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరుగు అన్నం అందిస్తున్నాం.

గరుడ వాహనంపై రామయ్య

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు.మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మీనారాయణరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. సాయంత్రం ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఎంపీటీసీ అపెరాసుల్తానా, ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ముందుకెళ్లాలి

చందుర్తి, ఏప్రిల్ 19 : చందుర్తి యువత స్వయం ఉపాధితో ముందుకు నడవాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో ఫుడ్ కోర్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించేందుకు ఆసక్తి చూపించాలన్నారు. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలతోపాటు స్వయం ఉపాధి మార్గాన్ని సైతం ఎంచుకోవాలన్నారు. స్వయం ఉపాధి రంగంలోనూ మంచి ఫలితాలు సాధించవచ్చని, నలుగురికి ఉపాధి కల్పించవచ్చని అన్నారు. జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పులి సత్యం, మ్యాకల గణేష్‌భీమరాజు కనకరాజు, నిర్వాహకులు లింగంపల్లి అశోక్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19:ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దలింగాపూర్, ముస్కానిపేట, అనంతారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శుక్రవారం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతుల సమస్యలపై మాట్లాడిన నాయకులు కొనుగోలు కేంద్రాల్లోకి ఎందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు గన్నేరం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: జిల్లాలోని ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హమాలీ సంఘం జిల్లా నాయకుడు పంతం రవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కోతలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్లను పంపిణీ చేయాలన్నారు. తాగునీటి వసతి, విశ్రాంతి కోసం తాత్కాలికి గుడారాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడిగా సందీప్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడిగా ఎడ్ల సందీప్ నియామకమయ్యారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో శుక్రవారం సందీప్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ విజయానికి పాటు పడాలన్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు పర్శరాములు, రాజం, బాలాగౌడ్, శివరామకృష్ణ, కల్యాణ్, నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

చందుర్తి ఏప్రిల్ 19: వేములవాడలో శనివారం నిర్వహించనున్న కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో రాజశ్రీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు మ్యాకల గణేష్, ధర్మపురి శ్రీనివాస్, గొట్టే ప్రభాకర్, భీమరాజు కనకరాజు, బండారి శేఖర్, వేల్పుల దేవస్వామి పాల్గొన్నారు.

కోనరావుపేట: వేములవాడలో నిర్వహించే కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోనరావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా కోరారు. శుక్రవారం కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరుకానున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు గంగాధర్, గోపాల్, ఎల్లయ్య, లక్ష్మారెడ్డి, ప్రభాకర్, మండల నాయకులు రవీందర్, రుక్మిణి, లింబయ్య రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

బాల్య మిత్రుడి కూతురు వివాహానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని బాల్య మిత్రుడు పంతంగి శ్రీనివాస్ కూతురు వివాహానికి 1988-1989 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు శుక్రవారం రూ.50 వేల నగదు, పుస్తెమట్టెలు, 50 కిలోల బియ్యం అందజేశారు. శ్రీనివాస్ నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆ కుటుంబం పరిస్థితిని తెలుసుకున్న మిత్రులు స్పందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మిత్రులు వేణు, గిరిధర్‌రెడ్డి, బాలయ్య, సుదర్శన్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లిలో గాలివాన బీభత్సం

- వర్షానికి తడిసిన ధాన్యం - నేలరాలిన మామిడి
- తెగిపడిన విద్యుత్ తీగలు



వీర్నపల్లిలో తడిసిన ధాన్యం

వీర్నపల్లి, ఏప్రిల్ 19: అకాల వర్షాలు రైతన్నకు శాపంగా మారాయి. వీర్నపల్లి మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన గాలివానకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. కవర్లు కప్పి రక్షించే ప్రయత్నం చేసినా వేగంగా వీచిన గాలులకు కవర్లు కొట్టుకుపోయాయి. ధాన్యం రాశులు, బస్తాలు వరద నీటికి తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. భారీ వర్షంతో కల్లాల్లో ఉన్న ధాన్యం నీటిపాలై అపార నష్టం వాటిల్లింది. ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సకాలంలో స్పందించక పోవడంతోనే రైతులకు ఈ దుస్థితి వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వరి కోతలు పూర్తయి పదిహేను రోజులు కావస్తున్న కొనుగోళ్లు చేపట్టకపోవడంతో పెద్ద మొత్తంలో ధాన్యం కల్లాల్లో మగ్గుతోంది.

తడిసి ముద్దయిన ధాన్యం

వీర్నపల్లి మండలంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి 17 గ్రామాల్లో సుమారు 10 వేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. లాల్ సింగ్ తండాలో ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గడ్డివాము ప్రధాన రహదారిపై వచ్చి చేరడంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న రెవెన్యూ శాఖ అధికారులకు ఆటంకం ఏర్పడింది. వెంటనే రెవెన్యూ సిబ్బంది గడ్డిని పూర్తిగా తొలగించారు. వీర్నపల్లి మండలకేంద్రంలో రైతు పిట్ల ముత్యంకు చెందిన మామిడి తోటలో మామిడికాయలు నేలరాలాయి. అకాల వర్షానికి సుమారు రూ.50 వేల పంట నష్టం వాటిల్లినట్లు రైతు పేర్కొన్నాడు.

దిగుబడి వచ్చినా చేతికిరాని పంట

అష్టకష్టాలు పడి కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని కల్లాల్లోకి తరలిస్తే కొనుగోలు చేసేవారు లేక పంట నీటిపాలైంది. కల్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు పూర్తిగా నీటిలో మునిగి పోయాయి. ఆరబోసిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోవడంతో రైతులకు కోలుకోని విధంగా నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారలు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండి పడుతున్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షం కురిసింది. దీంతో మార్కెట్ యార్డులో, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం మ్యాచర్ వచ్చినా



లాల్‌సింగ్ తండాలో తెగిపడిన విద్యుత్ తీగలు



వీర్నపల్లిలో నేల రాలిన మామిడి

కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాచర్‌కు వచ్చిన ధాన్యం అకాల వర్షం కారణంగా తడిసి ముద్ద కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లితోపాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. నిమ్మపల్లిలో నర్సయ్య లక్ష్మికి చెందిన ఇంటి రేకులు కొట్టుకపోవడంతో భయాందోళన గురయ్యారు. ఇంట్లోని సామగ్రి తడిసి ముద్దయ్యింది. పలు గ్రామాల్లోని కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. రేకులు కొట్టుకుపోయి నిరాశ్రయులైన నర్సయ్య లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకురాలు విమల కోరారు.

ముస్తాబాద్: మండల కేంద్రంతోపాటు, కొండాపూర్, రాంరెడ్డిపల్లె, ఆవునూర్, గూడెం, నామాపూర్ చిప్పలపెల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం తేలికపాటి వర్షం పడింది. గాలిదుమారం లేవడంతో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని కొంతమంది కుప్ప చేశారు. సెంటర్లలో ఆరబోసిన ధాన్యం పాక్షికంగా తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. గాలిదుమారంతో చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడి కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19: జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో నేరాల నియంత్రణపై నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై నిఘా పెట్టాలని, సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించాలని, ప్రజలకు భద్రతా భావం కల్పించాలని అన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రతీ రోజు వాహనాల తనిఖీలు చేపట్టాలని, అధికారులు, సిబ్బంది గ్రామాల్లో తరుచూ పర్యటించాలని అన్నారు. ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, మహిళా చట్టాలు, గంజాయితో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. మారతున్న పరిస్థితులకు అనుగుణంగా నేర విచారణ మరింత సమర్థవంతంగా సాగాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, మురళికృష్ణ, సర్వర్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

కోనరావుపేట, ఏప్రిల్ 19 : కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపై మాజీ మంత్రి ఆనందరావు చల్మెడ ఆసుపత్రి చైర్మన్ లక్ష్మీనరసింహారావు కుటుంబ సభ్యుల సహకారంతో సీతారామాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో చేపట్టిన ధ్వజ సంభ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వరప్రసాద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ న్యాయశాఖ మంత్రి చల్మెడ ఆనందరావు, చల్మెడ లక్ష్మీనరసింహారావు, చల్మెడ రాజేశ్వర రావు, వెంకటేశ్వర రావు, కిరణ్మయి, రాజ్యలక్ష్మి, సునీల, మధుసూదన్ రావు, కవిత, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ఆరే లత, మహేందర్ పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి

కోనరావుపేట, ఏప్రిల్ 19 : ప్రాచీన నాగరికత కళలను కాపాడుకోవాలని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో వేణుగోపాల స్వామి కళాకారుల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి చిరుతల రంభ రంపాల నాటక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాచీన కలలకు జీవం పోస్తున్న కళాకారులను అభినందించారు. కంప్యూటర్ యుగంలో ప్రాచీన కలలను కళాకారుల బృందం ముందు తరాలకు గుర్తుండేలా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూమిరెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే రైతులకు న్యాయం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: బీజేపీతోనే రైతులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని నర్సక్కపేట, వెల్జిపూర్, కందికట్కూర్, రేపాక తదితర గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రైతులకు పెట్టుబడి సాయం అందించడంతోపాటు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు దెశెట్టి శ్రీనివాస్, శ్రావణ్, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాధృక్పథాన్ని అలవర్చుకోవాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: విద్యార్థులు సేవాధృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లో శుక్రవారం బాబు జగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సర విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ ఇన్‌చార్జి డాక్టర్ రజియా సుల్తానాతో కలిసి మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యాంశాలతోపాటు సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు వివరించాలన్నారు. వ్యవసాయాధికారి సురేష్, కో ఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి రంజిత్, ప్రోగ్రాం అధికారి అరుణ్‌బాబు, భవ్యశ్రీ పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరావాలి

ముస్తాబాద్, ఏప్రిల్ 19 : కరీంనగర్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్ శనివారం నామినేషన్ వేయనున్న సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని ముస్తాబాద్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు కోరారు. ఉదయం 12 గంటల వరకు కరీంనగర్‌లోని వినోద్‌కుమార్ ఇంటి వద్దకు రావాలని, మధ్యాహ్నం రెండు గంటల వరకు నామినేషన్ వేస్తారని తెలిపారు.

భూ సమస్య పరిష్కరించాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: భూ సమస్య పరిష్కరించాలని మండలంలోని వెల్జిపూర్ గ్రామానికి చెందిన మూల లక్ష్మణ్ అనే రైతు శుక్రవారం ఎర్రనర్సపల్లె గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలి పాడు. తనకు తెలియకుండానే రెవెన్యూ అధికారులు తన కుటుంబీకులపై భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నచ్చజెప్పడంతో ట్యాంక్ దిగివచ్చాడు.

పార్టీలకు అతీతంగా సంఘం ఎన్నికలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: పార్టీలకు అతీతంగా జిల్లా మున్నూరు కాపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని అడహక్ కమిటీ సభ్యులు అగ్గి రాములు, లక్ష్మణ్, దేవరాజు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో మండల అధ్యక్షుడు నంది కిషన్ అధ్యక్షతన శుక్రవారం సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ సంఘం సభ్యత్వం నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ నెల 21 వరకు ఓటరు జాబితాను తయారు చేస్తామన్నారు. ఎన్నికల ప్రకటన వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. నాయకులు కృష్ణహరి, రాజం, బాల్‌రెడ్డి, నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులను ఆదుకుంటాం



కాలిపోయిన తాటి వనాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19 : తాటివనం నష్టపోయిన గీత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ భరోసా ఇచ్చారు. తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామ శివారులో కాలిపోయిన తాటివనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలిపోయిన తాటి వనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. అనంతరం సబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి గీత కార్మికులకు నష్టపరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. గీత కార్మిక కుటుంబాలను పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని వస్త్ర దుకాణాలు, రైస్ మిల్లులు, పెట్రోల్ బంకుల్లో శుక్రవారం ఫైర్‌సేఫ్టీపై అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. సిరిసిల్ల పట్టణంలోని వస్త్ర వ్యాపార సముదాయాలు, రగుడు సమీపంలోని రైస్‌మిల్లులు, బైపాస్‌రోడ్డులో పెట్రోల్ బంక్‌లలో అగ్నిప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని, సహాయక చర్యలు చేపడుతామని సిరిసిల్ల ఇన్‌చార్జి ఫైర్ అధికారి నర్సింహాచారి తెలిపారు. ఫైర్‌మెన్‌లు మహిపాల్, సాగర్‌రెడ్డి, నాగరాజు, జి.ప్రవీణ్ కుమార్, ఎస్‌డీ సాబీర్, రాజు, ఆపరేటర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి పారిపోతున్న అభ్యర్థులు

- మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19 : అవినీతి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయలేమంటూ లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులే పారిపోతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని కే కన్వెషన్‌లో కరీంనగర్ పార్లమెంట్ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. 'ఏడాదిలో కూలిపోతుంది.. మనమే అధికారంలోకి వస్తాం' అని బీఆర్‌ఎస్ నాయకులు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న పార్టీకి దమ్ముంటే ఒక్కసారి కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడాలని సవాల్ విసిరారు. పదేళ్ల ప్రతి పక్షంలో ఉన్నా ప్రభుత్వంపై కొట్లాడామన్నారు. సిరిసిల్ల అసెంబ్లీలో ఓడిపోయినా 288 పోలింగ్ బూత్‌లలో 100కు పైగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గం 288 పోలింగ్ బూత్‌లలో మెజార్టీ తీసుకొచ్చినవారిని సన్మానిస్తామన్నారు. భయపడి పొన్నం కరీంనగర్ నుంచి పారిపోయాడని ఓ బీజేపీ నాయకుడు మాట్లాడడం సిగ్గుచేటని, తాను మొగాడిని కాబట్టే హుస్నాబాద్‌లో గెలిచానని అన్నారు. నరేంద్ర మోదీ గుజరాత్ వీడి వారణాసీలో పోటీ చేసి గెలవడం లేదా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం తెలియనోడు కూడా రాజకీయాల్లోకి వచ్చాడని విమర్శించారు. 2004 నుంచి 14 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. పది సంవత్సరాల తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. ఆగస్టులో రూ.2లక్షలు రైతు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. దేశ వ్యాప్తంగా రైతు రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వమే మాఫీ చేసిందని, బీజేపీ, బీఆర్‌ఎస్ మాఫీ చేయలేదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతుల ప్రాణాలను తీస్తోందని, ఎన్నికల సమయంలో మాత్రం మొసలి కన్నీరు కారుస్తోందని



సిరిసిల్లలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మండిపడ్డారు. 60 సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉంటే రూ. 60 కోట్లు అప్పు చేస్తే పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ 7లక్షల కోట్లు అప్పులు మిగిల్చిందని అన్నారు. మరో రూ. 40 వేల కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల వస్తున్నాయని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇష్టారీతిలో లక్షల కోట్లు ప్రొసిడింగ్స్ ఇచ్చిందన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన బతుకమ్మ చీరల బకాయిలు రూ. 270 కోట్లు పెండింగ్ పెట్టిపోయిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు సంబంధించిన విభజన హామీలను అమలు చేయలేదన్నారు. కేంద్రం నాలుగు టెక్స్‌టైల్ పార్కులు ఇచ్చిందని, సిరిసిల్లకు రావాల్సిన టెక్స్‌టైల్ పార్క్ వరంగల్‌కు వెళ్తుంటే ఆపలేని దద్దమ్మ ఇప్పుడు కేంద్రానికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని అన్నారు. దేశంలో నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని రాహుల్ గాంధీ చెబుతున్నారని, మరోసారి నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఉండదని విశ్వగురువు పేరుమీద రాజ్యాంగంపై ప్రణాళికలు రచిస్తున్నారని అన్నారు.

మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఎప్పుడైనా ఎవరింటికైనా వచ్చారా? అని ప్రశ్నించారు. ఎంపీగా బండి సంజయ్ వేములవాడ, ధర్మపురి, కొండగట్టు, కాళేశ్వరం దేవాలయాల అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల నేత కార్మికులకు యాన్ సబ్సిడీపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. కార్మికులు, ఆసాములు ఆర్థికంగా ఎదగడానికి కొత్త విధానానికి ప్రణాళికను తీసుకొస్తుందని అన్నారు. 20 రోజులలో లోక్ సభ ఎన్నికలు ఉన్నాయని, కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలమని అన్నారు. నియోజకవర్గం పరిధిలోని అందరూ శ్రమించాలని, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని అన్నారు.

రాష్ట్రంలో ఊడ్చుకుపోయిన బీఆర్‌ఎస్

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఊడ్చుకుపోయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ తుక్కుగూడలో ప్రకటించిన పాంచ్ న్యాయ్‌ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి బయటపడడంతో బజార్‌లో పడిందని, దేశంలో బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. 'కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారున్న కేసీఆర్ ముందు నీ ఎమ్మెల్యేలను కాపాడుకో' అని హెచ్చరించారు. లోక్ సభ ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి మెజార్టీ తీసుకొస్తే రానున్న మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలవడానికి అవకాశం ఉంటుందన్నారు. రెండుమూడు రోజుల్లో కరీంనగర్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటిస్తారని, అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని అన్నారు. రానున్న రోజుల్లో జిల్లా అభివృద్ధి ఆగదని ఆ బాధ్యత తనదని అన్నారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అనంతరం వీర్నపల్లి ఉప సర్పంచ్‌తోపాటు వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, సత్యనారాయణగౌడ్, హుజూరాబాద్, కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థులు ప్రణవ్, పెరమాండ్ల శ్రీనివాస్, తంగళ్లపల్లి జడ్పీటీసీ పూర్మాణి మంజులలింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, ఆకునూరి బాలరాజు, కాముని వనిత, వెల్ముల స్వరూప, మడుపు శ్రీదేవి, మ్యాన ప్రసాద్, వైద్య శివప్రసాద్, గొట్టి రుక్మిణి, చక్రధర్‌రెడ్డి, సామల పావని, సామల దేవదాస్, వంగ మల్లేశం గౌడ్, గుడిశెట్టి బాలరాజు, ఎండీ అహ్మద్, ఎండీ ఖాజా, సంగీతం శ్రీనాథ్, మునిగెల రాజు, వెల్ముల తిరుపతి రెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సిరిసిల్ల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

సిరిసిల్లకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సీఐటీయూ, జేఏసీ నాయకులు కలిశారు. వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, వెంటనే కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శికూరపాటి రమేష్, జేఏసీ నాయకులు మూశం రమేష్, గోలి వెంకటరమణ, మండల సత్యం, తాటిపాముల దామోదర్, వేముల దామోదర్, గోవింద్ రవి, వెల్దండి శంకర్, కోడం రమణ, సిరిమల సత్యం, నక్క దేవదాసు తదితరులు ఉన్నారు.